# దేవుడున్నాడు జాగర్త

**కథానిక** జి. సి. జీవి.

పదికొట్టే సరికల్లా ఠంచన్‌గా సీట్లో వుంటాడు అప్పారావు, అనవసరంగా ఎవరితోటీ మాట్లాడడు. ఒక్క కాయితం కూడా పెండింగు పెట్టకుండా చకచకా తన పని చేసుకుపోతాడు. సరిగ్గా అయిదు కొట్టేసరికల్లా ఫైళ్ళు కట్టేసి ఆఫీసులోంచి బయట పడతాడు. సుబ్బారావు ఇందుకు పూర్తిగా విరుద్ధం. పదిన్నర దాటేక గాని ఆఫీసుకి రాడు. వస్తూనే ఆఫీసరు గారికో నమస్కారం పడేస్తాడు. ఆలస్యానికీ గల కారణాలు ఏకరువు పెడుతూ అతి వినయంగా క్షమాపణలు చెప్పుకుంటాడు. అయిదు దాటినా కూడా ఫైళ్ళతో కుస్తీపడుతూనే వుంటాడు. అయినా అతని సీట్లోని కాయితాలెప్పుడూ సమయానికి కదలవు. ఈ సంగతి ఆఫీసరు క్కూడా తెలుసు. అయితేనేం? అప్పారావు చెయ్యని చాలా పనుల్ని సుబ్బారావు అవలీలగా చేసేసి ఆఫీసరు గారి అనుగ్రహాన్ని పొందగలిగేడు. ఆఫీసరు గారికి చవకలో మంచి అద్దె ఇల్లు కుదిర్చి ఇవ్వగలిగేడు. కొత్తగా రిలీజయిన ప్రతి సినిమాకి వారి భార్యామణికి టిక్కెట్లు తెచ్చిపెట్టగలిగేడు. వారి 'మేరేజి డే'కి పనిగట్టుకుని వెళ్ళి కానుకలు సమర్పించుకున్నాడు. శివ పార్వతులతోనూ, సీతా రాములతోను, రాధా కృష్ణులతోను ఆఫీసరు దంపతుల్ని పోలుస్తూ ఓ డజను పద్యరత్నాలు (ఎవరిచేతో వ్రాయించినవి) చదివి వారిని ఆనందింపజేసేడు. అప్పుడప్పుడూ ఏదో ఒక వంకతో ఆఫీసరు గారికి తీర్థం పార్టీలు, నైవేద్యపు విందులు, పవ్వళింపు సేవలు చాలా వైభవంగా జరిపించేడు. భక్తుడి సేవలకు మెచ్చి ఆఫీసరు గారు వరమిచ్చేరు. తత్ఫలితంగా సుబ్బారావుకి ప్రమోషనొచ్చింది. "ఆఫీసులో అందరి కంటె కష్టపడి పనిచేసేది మీరు. సీనియారిటీ ప్రకారం చూసినా ఆ ప్రమోషను మీకే రావాల్సింది. కాని ఆ సుబ్బారావు కొచ్చింది ఎందుకనుకున్నారు?" అని అడిగింది భార్య, అప్పారావుని. సమాధానం కూడా ఆవిడే చెప్పింది:

"ఆ సుబ్బారావు మీలా నాస్తికుడు కాదు. ఎంచక్కా భగవంతుడ్ని నమ్ముకున్నాడు. ప్రతి శనివారం వాళ్ళింట్లో వెంకటేశ్వర సుప్రభాతం చదువుతారు. ప్రతి గురువారం వాళ్ళావిడ సాయిబాబా భజనకు వెడుతుంది. ప్రతి యేడాదీ వాళ్ళు తిరుపతికి వెళ్ళి మొక్కుబళ్ళు చెల్లించి వస్తుంటారు. మీరేమో దేవుడే లేడని వాదిస్తారు. చాలక ఆ పిచ్చి నాక్కూడా పట్టిస్తిరి. భగవంతుడు లేకపోలేదు. నమ్ముకున్నవాళ్ళ కెప్పుడూ మంచే జరుగుతుంది. ఒప్పుకుంటారా ఇప్పటికైనా?"

"ఒప్పుకుంటున్నాను. ఆ దేవుడికీ, మా ఆఫీసరుకీ ఏమీ తేడా లేదని ఒప్పుకుంటున్నాను."

# అభ్యర్థి (ఎన్నిక కథ)

ఓ కొంగ చెరువు గట్టు వెంబడే దీనంగా అడుగులేసుకుంటూ పోతూంది.

"ఏమిటల్లా వున్నారు, కొంగ బావగారు!" అని పలకరించింది, పక్కనున్న చెట్టు కొమ్మ మీద కూర్చున్న కాకి.

"ఏమడుగుతావు? ఒక్క కప్పకి కూడా నేనంటే ఇష్టం లేదు కదా. చూడు, వస్తూంటే ఎల్లా తప్పుకుపోతున్నాయో. నేనేం చేశాను వాటి కపకారం?"

"చేసుకున్నంత మహాదేవ! ఇతరుల విషయంలో నువ్వెల్లా వుంటే వాళ్ళూ నీ పట్ల అల్లాగే వుంటారు" అంది కాకి.

"నేనల్లా వుంటున్నానా? నాకీ కప్పలంటే ఎంత ఇష్టం? అవి ఎంత రుచిగా వుంటాయి!" అని కొంగ మహా నొచ్చుకుని ఇద్దైపోయింది.